# బహుమతి

## శ్రీమతి లక్ష్మిగాయత్రి

వెలుగు నీడల మధ్య జుహూబీచ్ కోలాహలంగా వుంది. సముద్రపు హోరు కంటె జనం కబుర్ల జోరే ఎక్కువగా వున్నట్టు తోచింది విజయేంద్రకి. అతడు బొంబాయి ఎప్పుడు వచ్చినా, సాధారణంగా జుహూబీచ్‌కి వస్తూనే వుంటాడు. సముద్ర తరంగాలు ఎదురుగా వికృత రూపం దాలుస్తున్న నాగరికతని చూసి ఘోష పెడుతున్నట్టు అనిపిస్తూంటుంది అతడికి.

ఎప్పటిలాగే ఒంటరిగా కూర్చుని వున్నాడు విజయేంద్ర. బొంబాయిలో స్నేహితులంటూ ఎవరూ లేరు, పరిచయస్తులు తప్ప. నిరంతరం వ్యాపారంలో మునిగి తేలుతూ వుండే వాళ్ళకి బీచ్‌కి వచ్చి కులాసాగా కాలం గడిపేంత తీరిక వుండదు. కాని విజయేంద్ర మాత్రం వీలున్నప్పుడల్లా వస్తూనే వుంటాడు.

గాలి కాస్త ఎక్కువగానే వుంది. చీకటి పడబోతూంది. ఇసుకలో గీతలు గీస్తున్న విజయేంద్ర వేలికి గరగర మంటూ ఏదో తగలడంతో చేతిని ఇసుకలోకి పోనిచ్చి ఆ వస్తువుని బైటికి లాగాడు. అది ఒక కాగితం ముక్క. చాలాచిన్నది. పావురావులో సగం వుంటుందేమో మట్టి గొట్టుకుని మురిగ్గావున్న ఆ కాగితం మీద తెలుగులో ఏదో వ్రాసి వుండడంతో కాస్త ఆశ్చర్య పడ్డాడు విజయేంద్ర. కాగితం అంత పాతది కాదు. దాన్ని జాగ్రత్తగా తుడిచి చదవసాగాడు.

అది ఒక ఉత్తరం. కానీ మొదటి నించీలేదు. బహుశా మొదటి భాగం ఇంకెటువైపో ఎగిరి పోయి వుంటుంది. మధ్యనించీ వున్న ఆ ఉత్తరం చివరి భాగం కూడాలేదు. మొదలూ చివరా ఎటో ఎగిరి పోయిన ఆ మధ్య భాగంయిలా సాగింది.

"ఈ మధ్య అక్కడికి వద్దామనుకోవటమే కాని, రావటం పడనేలేదు, కానీ అనుక్షణం నువ్వు నా గుండెల్లోనే మెదులుతూ ఉంటావంటే నమ్ముతావా నువ్వు? కరిగి పోతున్న కాలం నిన్ను పొందలేని లోటుని మరింతగా ఎత్తి చూపిస్తుంటే యీ వేదన భరించటం నాకు అసాధ్య మవుతూంది! ఏబలహీన క్షణంలో నన్ను నేను మర్చిపోయి నీ దగ్గరకి వచ్చేస్తానో అనిపిస్తూంది. రాహుల్! అసలు నువ్వెప్పుడైనా నాగురించి యింత పిచ్చిగా ఆలోచిస్తావా? ఒకోసారి నాలో ఎంత స్వార్థం ప్రబలుతుందంటే నిన్ను నీకు కాస్త కూడా మిగల్చకుండా పూర్తిగా నా స్వంతం చేసుకోవాలనిపిస్తుంది....."

ఇలా సాగిన వుత్తరం అక్కడితో ఆగిపోయింది. అర్ధాకలితో లేచిపోవాల్సి వచ్చిన అన్నార్తుడిలా విజయేంద్ర మిగిలిన రెండు ముక్కల కోసం వెతికాడు. కానీ ఎక్కడా గోచరలేదు. మధుర స్వప్నం కరిగిపోయినట్టూ, అసంతృప్తితో ఆ ముక్కనే జేబులో పెట్టుకుని హోటల్ చేరుకున్నాడు.

ఇరవై నిమిషాల తరువాత ఐస్‌క్యూబ్స్ వేసిన విస్కీ నెమ్మదిగా గొంతులోకి దిగుతుంటే ఆ వుత్తరం చదవటం మరింత అద్భుతమైన అనుభూతిగా తోచింది విజయేంద్రకి. పూర్తిగా లభించిన ప్రేమగాని క్షణం విడిపోకుండా వుండటం కాని పూర్తి మాధుర్యాన్ని చేకూర్చవు. కొద్దిపాటి విరహం, అందులో మధురవేదన ప్రేమకి మరింత డెప్తుని చేకూరుస్తాయి.

కాలింగ్‌బెల్ మోగటంతో కాగితం జేబులో పెట్టుకుని విసుగ్గా తలుపు తీశాడు విజయేంద్ర. ఎదురుగా చిరునవ్వుతో ఖాదర్. అంతకుముందు రోజే ఖాదర్‌తో పరిచయమైంది. ముప్పై ఐదేళ్ళ ఖాదర్ చాలా హుషారుగా వుంటాడు. అతడి మాటల్నీ, మాట్లాడే తీరునీ బట్టి అతణ్ని బేవకూఫ్ అనుకుంటే అది



చాలా తప్పు చాలా యీాజ్‌తో మాట్లాడే ఖాదర్ మాటల వెనుక అతడి సీరియస్‌నెస్‌నీ, అవసరంలో అతడు పంచి యిచ్చే ఆప్యాయతనీ గ్రహించగలిగే శక్తి విజయేంద్రకుంది అందుకే నవ్వుతూ ఆహ్వా- నించేడు

ఖాదర్‌కి తెలుగురాదు కానీ హిందీ ధారాళంగా మాట్లాడగల విజయేంద్రకి అతడితో లాంగ్వేజ్ ప్రోబ్లమ్ రాదు

ఖాదర్‌కి మరో గ్లాసు అందించేడు విజయేంద్ర తేలిగ్గా అందుకున్నాడు ఖాదర్ కబుర్ల మధ్య కాలం జారిపోతూంది అనుబవించే వయసులోనే అనుభ- వించాలి విజయ్‌జీ! వాచీ ముళ్ళెప్పుడూ వెనక్కి తిరగవు మనం బలవంతంగా తిప్పలేం తిప్పితే వాచీ పాడైపోతుంది!

ఖాదర్ మాటలు కొంచెం బోరు కొడుతున్నాయి విజయేంద్రకి ఎ సి చల్లదనంలో విస్కీ వెచ్చదనం, ఆ అనుభూతుల మధ్య ప్రేమలేఖ అందిస్తున్న చల్లదనం, నులివెచ్చని ఒంటరితనపు నీడన అందమైన భావాల్ని కలిగిస్తుంటే

అన్య మనస్కంగా ఏవేవో ఆలోచనల లోయల్లోకి జారిపోయాడు విజయేంద్ర

ఖాదర్ నవ్వుతూ అంటున్నాడు -'నాకో స్నేహితు- డున్నాడు మీ తెలుగువాడే జీవితాన్ని ఎంత హాయిగా అనుభవిస్తాడని? నిజంగా తుమ్మెదే ఈ విశాల బారతంలో పూలకేం కరువు?

విజయేంద్ర నవ్వి వూరుకున్నాడు అతడి ముభావాన్ని గమనించి గ్లాసు టీపాయ్‌మీద పెట్టి లేచి నిలబడ్డాడు ఖాదర్ వెళ్ళొస్తాను విజయ్‌జీ! థేంక్స్ ఫర్ ది ఆఫర్ హేపీ నైట్!

* * *

వెళ్ళిన పని అనుకున్న దానికంటె త్వరగా అయిపోవటంతో బొంబేనించి త్వరగానే వచ్చేశాడు విజయేంద్ర




తలుపు తీస్తూనే భర్తని చూసి ఆశ్చర్యపోయింది విమల

చాలా త్వరగా వచ్చేశారే అంది లోపలికి దారి తీస్తూ

ఊఁ నిన్ను చూడాలని తొందర పుట్టి

ఏమిటి, చాలా హుషారుగా వున్నట్టున్నారు ఇది మరీ ఆశ్చర్యం!'

నవ్వేశాడు విజయేంద్ర

ఆ రోజు రాత్రి నిశ్శబ్దంలో విమల తల్లోని విరజాజుల్ని మృదువుగా తాకుతూ అన్నాడు విజయేంద్ర ఈసారి అనుకోకుండా త్వరగా వచ్చేయటంవల్ల నీకేం కొని తీసుకురాలేదు విమలా! కానీ, ఈసారి ఒక వెరైటీ బహుమతి తీసుకొచ్చాను!

'ఏమిటది? కుతూహలంగా అడిగింది విమల

తలగడ కింద నించి కాగితం తీసి విమల కిచ్చాడు విజయేంద్ర మురికిగా వున్న ఆ కాగితాన్ని ఆశ్చ- ర్యంగా తీసుకుంది విమల

జుహూ బీచ్‌లో దొరికిందిది చదివిన మరుక్షణం ఏవేవో లోకాల్లో తేలిపోయాను కానీ అసలైన విషయం కొంచెం ఆలస్యంగా తట్టింది–ఇంత అందమైన ప్రేమ లేఖని ఆ ప్రేమికుడు ఎందుకు చింపేశాడా అని?!

కాగితం చదివి నిరాసక్తంగా మడిచేస్తూ అంది విమల, ఆ అమ్మాయెవరో రాసింది, అతను చింపి పారేశాడు, మధ్యలో మీరా కాగితం ముక్కని పూజించటమేమిటి?

అలా అనకు, విమలా! ఆ ఉత్తరం వ్రాసిన అమ్మాయెవరో చాలా భావుకత్వం గల మనిషై వుండాలి తను వ్రాసిన వుత్తరం అతను చింపేశాడని తెలిస్తే ఆ అమ్మాయి ఎలా తట్టుకుంటుందో నేను వూహించలేక పోతున్నాను! అసలు అతను వుత్తరం ఎందుకు చింపేశాడంటావ్?

అలాంటివన్నీ మీలా ఆలోచిస్తూ బుర్ర పాడు చేసుకునే అలవాటు లేదు నాకు! నిద్ర వస్తోంది, పడుకుంటాను! చేతిలోని కాగితాన్ని వుండగా చుడుతూ అంది విమల

ఆఁ, ఆఁ, ఆ ఉత్తరాన్ని అలా నలపకు ఇలా ఇచ్చెయ్! విమల చేతిలోంచి ఉత్తరం తీసు- కున్నాడు విజయేంద్ర విమల అటు తిరిగింది

* * *

కొన్నాళ్ళు గడిచాయి

బార్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ డ్రింక్స్ తీసుకుంటున్నారు విజయేంద్ర, ఖాదర్ 'వచ్చిన పని మూడొంతులు అయిపోయింది. నేను బహుశ రేపు తిరిగి బొంబే వెళ్ళిపోవచ్చు విజయ్‌జీ! అన్నాడు ఖాదర్

ఎలా వుంది మా ఆంధ్రా? నచ్చిందా మీకు?'

ఇండియాలో ఏ మూల కెళ్ళినా నాకంత ఇండియాలాగే కన్పిస్తుంది విజయ్‌జీ! అంచే

నచ్చటం నచ్చక పోవటం అన్న ప్రశ్నే లేదు'

విజయేంద్ర చిరునవ్వు నవ్వాడు

ఖాదర్ కూడా చిలిపిగా నవ్వుతూ, కానీ ఆంధ్రాలో ఒక వ్యక్తిని చూడాలని కోరిక నాకు బహుశా తీరదేమో' అన్నాడు

ఎవరా వ్యక్తి?

ఎవరంటే ఖాదర్ గ్లాసు టేబిల్‌మీద పెట్టి సిగరెట్ వెలిగిస్తూ, బాంబేలో మీ హోటల్‌కి వచ్చినప్పుడు చెప్పాను మీకు గుర్తుందో లేదో నాకో స్నేహితుడున్నాడని, జీవితాన్ని అనుభవించటం వాడికి తెలిసినంతగా మరెవరికీ తెలియదని వాడు చాలా అందంగా వుంటాడు ఒ ... మగవాళ్ళలో అంతటి అందం అరుదుగా వుంటుందేమో వాణ్ణి చూసినప్పుడల్లా ఆస్కార్‌వైల్డ్ డొరియన్ గ్రే- గుర్తొస్తారు నాకు డొరియన్ గ్రే అందం, హెన్రీ వాటన్ తత్త్వం కలిసిన వాడు వీడు

వాణ్ణి చూసిన ఏ అమ్మాయి చలించకుండా ఉండలేదేమో చలించిన ఏ అమ్మాయినీ వీడు విడిచి పెట్టను కూడా లేదు కొంతమంది అమ్మాయిలు వాడికి వుత్తరాలు కూడా వ్రాస్తుంటారు చాలావరకూ ఆ వుత్తరాలన్నీ నాన్సెన్సికల్ అనుకోండి కానీ ఖాదర్ క్షణం ఆగి, ఆంధ్రా నించి మాత్రం ఒకమ్మాయి వ్రాస్తుంటుంది ఉత్తరాలు చాలా బావుంటాయి వాడు కూడా అప్పుడప్పుడు చాలా సిన్సియర్‌గా రియాక్ట్ అవుతుంటాడు కానీ ఈమధ్య ఎంచేతో అంత వెర్రిగా వుత్తరాలు రాసే ఆ అమ్మాయి వుత్తరాలు వ్రాయటం తగ్గించింది అంతేకాదు విమలకి ఏనాడో పెళ్ళి పోయిందని తెలిసింది ఖాదర్ క్షణం ఆగి నవ్వుతూ, ఆ అమ్మాయిని, విమలని చూడాలని అన్నాడు

ఆ నవ్వులో కనిపిస్తున్న తేలికభావం, వింత వస్తువుని చూడాలన్న కుతూహలం విజయేంద్ర క్షణంలో తేరుకుంటూ, మీ స్నేహితుడి పేరేమిటన్నారు? అన్నాడు

రాహుల్

*　　*　　*

'రాత్రి చాలా నిశ్శబ్దంగా వుంది

ప్రక్కనే వున్న భర్త నిశ్శబ్దాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలీక విమల తికమక పడ్తూంది పెళ్ళైన ఈ మూడేళ్ళలో అతడెప్పుడూ మౌనంగా లేడు ఇలాంటి సందర్భాల్లో ముఖ్యంగా

ఈలోగా అతడే కదిలేడు ఏమిటలా చూస్తున్నావ్? అన్నాడు నవ్వుతూ

విమల తేలిగ్గా వూపిరి పీల్చుకుంటూ, ఇంతసేపూ మాట్లాడకుండా పడుకున్నది కాక నన్నంటున్నారా? అంది నవ్వుతూ, కవ్విస్తున్నట్టూ

విజయేంద్ర మామూలుగా, ఇవేళ సాయంత్రం నాకో విషయం తెలిసింది దాన్ని గురించి ఆలోచిస్తున్నాను' అన్నాడు

విమల దాన్ని అంత సీరియస్‌గా తీసుకోకుండా ఏమిటది? అంది

అతడు డైరెక్ట్‌గా రంగంలోకి దిగుతూ ఇదే వూరినుంచి విమల అనే ఒకమ్మాయి బాంబేలో రాహుల్ అనే ఒక అందమైన అబ్బాయికి వుత్తరాలు రాస్తున్నట్టు తెలిసింది ఆ విమల ఎవరా అని ఆలోచిస్తున్నాను' అన్నాడు

ఏ భావమూ ధ్వనించని కంఠంతో అతడు చెప్పిన విషయంలోని తీవ్రతని అర్థం చేసుకోవటానికి, ఆమెకి కొన్ని క్షణాలు పట్టింది

అర్థమైన తరువాత మాట్లాడటానికి నోరు సహకరించలేదు చలన రహితంగా వున్న ఆమెని తాకుతూ ఏమిటలా అయిపోయేవ్? అన్నాడు విజయేంద్ర

విమల ఒక్కసారిగా చలనం వచ్చినట్టు కదులుతూ ఏవండీ అంది ఇంకేం మాట్లాడలేనట్టు కాటుక దిద్దిన కళ్ళలో నీళ్ళు నెమ్మదిగా చెంపల మీదికి జారుతున్నాయి

విజయేంద్ర నవ్వుతూ, నువ్వే ఆ విమలవైతే నేనేమీ అనుకోను నేను ఒథెల్లోని నువ్వు డెస్టిమోనావి కద కొంచెం మారిందనుకుంటాను అంతే' చెప్పు నీకు నన్ను వదిలేసి వెళ్ళిపోవాలనుందా? అన్నాడు

ఒక్కసారిగా గట్టు తెగింది విమల చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తూ నేను తప్పే చేశాను చాలా తప్పు చేశాను నన్నిలా శిక్షించవలసిందే' కానీ ఒక్క పని మాత్రం నేను చెయ్యలేదండీ-రాహుల్‌ని నేను ప్రేమించలేదు మిమ్మల్నే నా ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తున్నానని మీరు బాంబే వెళ్ళొచ్చాక బాగా తెలిసింది రాహుల్ మీద భ్రమని తొలగించుకోగలను కానీ మీ మీది ప్రేమని చంపుకోలేనండీ చంపుకోలేను' అంది

విజయేంద్ర ఆమెను దగ్గరగా తీసుకుంటూ, పిచ్చి విమ్మీ ఆవ్టాల్ వుయార్ హ్యూమన్ బీయింగ్స్ వూరుకో' అన్నాడు

విమల ఏడుస్తూ తల్లి రెక్కల మాటున ఒదిగిన పక్షిపిల్లలా ఒదిగి పోయింది

కానీ, విమ్మీ' భార్య ఎవరికో రాసిన ప్రేమలేఖని భర్త ఆ భార్యకే బహుమతిగా తెచ్చి యివ్వటం చిత్రం కదూ? ఎంత మామూలుగా అనాలనుకున్నా అతడి గొంతు వణికింది

నల్లగా, స్ఫోటకం మచ్చలతో గుంటలు పడ్డ అతడి చెంపల మీదికి ఒక్క కన్నీటి చుక్క జారింది

అతడు ఒథెల్లో-ఆమె డెస్టిమోనా ఐనా కద సుఖాంతమైంది □

## పైసా!

రాయంచలిన
రాముని
రాజ్యమైనా...
నిజానికి
ఇది
రాకెట్ యుగమైనా...
పాకెట్లో
పైసా లేనిది
మనిషికి లేదు
మార్కెట్లో
మంచి-మర్యాద!

—ఎస్. మొగులయ్య సాగర్

